# ప్రేమంటే?



శశికళ డోర్ తీసుకుని స్టూడియోలోకి అడుగు పెట్టింది. బరువుగా, మెత్తగా స్ప్రింగ్ డోర్ మూసుకుంది. పక్క స్టేషన్ నుండి ఉన్నత పాఠశాల విద్యార్థుల కార్యక్రమం రిలే అవుతోంది. శశికళ చేతిలో వున్న టేపులూ క్యాసెట్లు డెక్ మీద పెట్టి, కార్యక్రమంలో ముందుగా వెయ్యాల్సిన పాట డిస్క్ తీసుకుని చూసింది. ప్రేమంటే తెలుసా నీకు!

అంత వరకు ఆ పాట రికార్డు చూసినా, విన్నా శశికళ నవ్వుకునేది. కానీ ఈ వేళ దుఃఖంగా, కోపంగా కసిగా మనసు విలవిల్లాడి పోయింది.

నిజంగా ప్రేమంటే ఏమిటి? కంటికి కనిపించకుండా, వంచించి బాధించే ఆ ప్రేమ అనేది ఎక్కడుంటుదో ఎవరికి తెలుసు? అసలుందో లేదో అనుకో దానికి వీల్లేకుండా ఎప్పుడూ వున్నా నంటూ ఏడిపించుకుతింటుంది.

'తెలుసా నీకు?' అంటూ గొంతు చించుకుంటే తెలీదని ఎవరనగలరు? పోనీ తెలుసని మాత్రం ఎవరనగలరు?

రిలే కార్యక్రమం ముగింపు కొచ్చింది. రిలే కార్యక్రమం అయి రెడ్ లైట్ వెలగగానే ఫేడర్ తీసి ఆకాశవాణి..... కేంద్రం ఇప్పుడు..... కార్యక్రమం వింటారు. అని సిగ్నేచర్ మ్యూజిక్ వేసి తల విదిలించుకుంది శశికళ.

మూడేళ్ళ పిల్లగా వున్నప్పుడు పోలియో వల్ల లాగేసిన కాలువల్ల శశికళలో వున్న అందమంతా బూడిదలో పోసిన పన్నీరైంది. దానికి తగ్గట్టు చిన్నప్పటి నుంచి అంతా చూపించే సానుభూతి మనసుకి అవమానంగా వుండేది. అంతకంటె బాధ "అసలే ఆడపిల్ల కల్యాణ యోగం వున్నట్లు లేదు" అని ముఖాన్నే అనే వాళ్ళ మాటలు. అవన్నీ భరిస్తూ కసిగా చదువుతూ అన్ని క్లాసులూ మంచి మార్కులతో ప్యాసయింది.

కాలువంకరైనా కలలుగనే మనసుకి కదిలొచ్చిన వయసుకి వంకరేం లేదు. ఏదో ఆశ ఎప్పుడూ మనసుని వుత్సాహ పరుస్తూ వుండేది. ఎంతో సుందరమైన జీవితం కళ్ళముందు కనిపిస్తూ వుండేది.

అనుకోని విధంగా రాజాతో పరిచయం. అతను తన యందు చూపుతున్న ప్రేమాభిమానాలూ శశికళ పేద మనసుని ఉబ్బితబ్బిబ్బు చేశాయి.

తన కాలు వంకర. తన నడక ఎత్తెత్తి వంకరగా అవకరంగా కనిపిస్తుంది. కాని తన నడతలోని నిశ్చలత, గొప్పతనం ఎవరో ఒకరు గ్రహించక పోరు అని కలలు కనేది. అదే నిజమైనట్టు ఆమెకి రాజాతో పరిచయం దిన దినం పెరుగుతూ వచ్చింది. రాజా తన చేతిలో చెయ్యివేసి "నువ్వంటే నాకు ఎంతిష్టమో చెప్పలేను" అన్నప్పుడు పరవశించి పోయింది.

"జీవితాంతం నువ్వేనా జీవన సహచారిణివి" అన్నప్పుడు తనని తనే మర్చిపోయింది. ఇంట్లో ఎవ్వరూ తన సంగతి గ్రహించకుండా జాగ్రత్త పడింది. తెలిస్తే వాళ్ళు తనని కొట్టి కొరత వేసినా వెయ్యక పోయినా వాళ్ళు చేసే హేళన, ఎగతాళి తను భరించటం కష్టం. అమ్మ సణుగుడు మొదలు పెడుతుంది. "అందని ఆశలకి పోవడం వెర్రితనం. నీదారిన నువ్వు బ్రతకడం నేర్చుకో. దేనికైనా నుదుటి రాత వుండాలి" అంటూ తీసి పారేస్తుంది ఆ విదిలింపు —, ఆ వైరాగ్యపు ధోరణి శశికళని నిలువునా కృంగదీస్తాయి.

తను కాలేజీ నుంచి వచ్చేటప్పుడు —, నోట్సు కోసం విమల వాళ్ళింటికి వెళ్ళినప్పుడు రాజాని

ఇంద్రగంటి జానకీబాల

కలుసుకునేది. కబుర్లు చెప్పేది. అతని సాంగత్యంలో అపురూపమైన ఆనందం అనుభవించేది. ప్రపంచాన్ని జయించిన అతిశయం, దేవుడు రాసిన నుదుటి రాతని మార్చేసిన విశ్వాసం — తృప్తి ఆమెలోని ఆశకి క్షణం క్షణం ఊపిరి పోసి పెంచాయి.

*XX XX XX XX*

ఆ రోజు రాగిణి కడప నుంచి వచ్చినప్పుడు తను ఎంతో ఆనందపడిపోయింది. రాగిణి శశికళకి మావయ్య కూతురైనా సొంత అక్కచెల్లెళ్ళ కంటే ఎక్కువగా వుండేది —

ఆరోజు సాయంత్రం రాగిణికి రాజాని చూపించి పరిచయం చేసే వరకు శశికళ ఒక్క నిముషం నిలువ లేక పోయింది —

ముగ్గురూ ఎన్నో హోట్లకి తిరిగారు. ఎ.సి. హోటల్లో కాఫీ తాగుతున్నప్పుడు — పది కిలోమీటర్ల దూరంలో వున్న సినిమా హాల్లో సినిమా చూస్తున్నప్పుడూ శశికళ ఎంతో స్వేచ్ఛగా ఫీలయింది. తను ఒక్కతీ అతనితో ఎక్కడైనా వెళ్ళాలంటె ఏదో బెరుగ్గా వుండేది. ఎవరైనా చూస్తారని భయంగా వుండేది.

ఆరోజు హాయిగా గుండెలనిండా ఊపిరి పీల్చుకుంది.

రాగిణి వున్న వారం రోజులూ సుఖంగా గడిచి పోయాయి. శశికళ ఎన్నోసార్లు రాగిణితో చెప్దామనుకుంది. రాజా తనని ప్రేమిస్తున్నాడని, తామిద్దరూ పెళ్ళి చేసుకోబోతున్నామనీ. చెప్పాలని ఎంతో ఆరాటపడింది. కాని ఆమెలోని సిగ్గు, ఆడతనం ఆ మాటలు పైకి రానీయలేదు. ఆమె వెళ్ళంగానే వుత్తరం రాద్దామనుకుంది. రాగిణి వెళ్ళిన మర్నాటి నుంచి రాత్రికొక వుత్తరం చొప్పున ఊహించుకుంటూ పడుకునేది. ఏదీ రాసిన పాపాన పోలేదు.

తీరా నెల తిరిగే సరికి మావయ్య ఊడి పడ్డాడు. శశికళ మావయ్యని చూసి ఆశ్చర్య పోయింది.

''ఏమే ఆ రాజా రావనే కుర్రవాడు మంచి వాడేనా? నీకు తెలుసటగా'' అన్నాడు. ఆ మాటలు విని శశికళ స్థాణువులా వుండి పోయింది — అంతలోనే బుర్ర చురుకుగా పని చేసింది. కథ ఎలాంటి మలుపు తిరుగుతోందో అర్థమైంది. అయితే శశికళ మావయ్య ఆమె చెప్పే జవాబు గురించి పెద్దగా పట్టింపు వున్నట్టు కనిపించ లేదు. రాగిణికి, రాజారావుకి మధ్య ఈ నెల్లాళ్ళూ ముమ్మరంగా వుత్తర ప్రత్యుత్తరాలు సాగాయట. ఓ రోజున రాగిణి తండ్రికి విషయం చెప్పి, వివరాలు ఇచ్చి మాట్లాడి రమ్మని చెప్పిందట. దాని ఫలితమే మావయ్య రాక అని తెలుసుకున్న శశికళ నిలువునా నీరైంది. మనిషి మనిషంతా కన్నీరైంది.

తన కళ్ళముందే రాగిణికి రాజాకి పెళ్ళి నిశ్చయమై పోతుంటే నిస్సహాయంగా చూస్తుండి పోయింది శశికళ.

ఆ సాయంత్రం ఆవేశంగా, ఆక్రోశంగా రాజాని కలిసింది. ఈ పెళ్ళేంటి మాటలతో అతన్ని పొడిచి వదిలింది.

అతను దానికి పెద్దగా చలించకుండా ''నువ్విందులో బాధ పడితే నేను చెయ్యగలిగిందేమీ లేదు — నీ అందం, చదువు చూసి, నీ కాలు వంకరైనా నిన్ను ప్రేమిద్దామనుకున్నా — కానీ నీ అంత అందగత్తె చదువుకున్నది నీ లాంటి అవకరం లేని మరొక అమ్మాయి నన్ను యిష్టపడితే, ఆమెని ఎన్నుకోవడంలో నా తప్పేమిటో నా కర్థం కావడం లేదు'' అన్నాడు తాపీగా.

'ప్రేమిద్దామనుకున్నా' అన్నమాటలు ఆమె మనసుని తూట్లు పరిచాయి. ఇంతకాలం ప్రేమించ లేదా! ఇంకా ఎప్పుడో ఆ కార్యక్రమం మొదలు పెడదామనుకుంటున్నాడా? అంటే ప్రేమంటే ఏమిటి? — తనలో ఇన్నాళ్ళు కలిగిన ఈ హృదయ స్పందనలన్నీ ప్రేమకి చిహ్నాలు కావా? —

తననింత వంచించి పరోక్షంగా రాగిణితో వుత్తరాలలో ప్రేమకలాపాలు సాగించి, పెళ్ళి దాకా తీసుకొచ్చేశాడు.

అతను చేసిన వాగ్దానాలూ, చెప్పిన మాటలూ అన్నీ అబద్ధాలని అనుకోవాలంటే తనకే ఎంతో సిగ్గుగా వుంది.

అతను రాగిణిని ప్రేమించానని చెప్పుకుంటున్నాడు.

*XX XX XX XX*

'ప్రేమంటే తెలుసా నీకూ' పాట అయిపోయింది. శశికళ వులిక్కిపడింది — తర్వాత ప్రకటన యిచ్చి, ప్రోగ్రాము టేపు ఆన్ చేసింది —

అంగవైకల్యం పుణ్యమా అని శశికళకి ఆకాశవాణిలో వుద్యోగం వచ్చింది. అశాంతితో అలమటించి పోతున్న ఆమెకి ఆధారం దొరికినట్లని పించింది. మూడు నెలలుగా ఈ పనిలో పడి, మనసులోని కలత మర్చి పోతూ వచ్చింది.

నిన్ననే రాగిణి వచ్చి పార్టీకి రమ్మని బలవంతం చేసి తీసుకెళ్ళింది. అక్కడందరూ రాగిణిది రాజాది ప్రేమ వివాహమని అభినందిస్తుంటే శశికళ గుండెలు మండి పోయాయి ......

మాని పోతున్న పుండు రేగినట్లయింది. ఇంతలో ఎవరో డోర్ తీసుకొచ్చారు. అటు తిరిగి చూసింది — మదన్ మోహన్. లేని నవ్వు తెచ్చుకుని విష్ చేసింది.

ఈ నెల సెవెన్త్ ఓ.బి.కి మీరు నాకు అసిస్టెంట్. అందులో డ్యాన్సు ఒకటి పెట్టాం. ''మరులు గొంటిరా — మరువకురా అది రెండు టేపుల మీద డబ్ చెయ్యండి — ఒకటి స్టాండ్ బై కావాలి'' అన్నాడు.

''అలాగే సాయంత్రం కూర్చుని చేస్తాను'' అంది నెమ్మదిగా.

''ఈ రేడియోలో స్టాండ్ బై లేక పోతే చాలా కష్టం సుమండీ. మర్చిపోకుండా రెండు టేపులు చెయ్యండి'' అంటూ అతను టేపుల కట్ట పుచ్చుకుని బయట కెళ్ళి పోయాడు.

శశికళ విషాదంగా నవ్వుకుంది. రేడియో లోనే కాదు. జీవితంలో కూడా స్టాండ్ బై కావాల్సిన రోజులివి అనుకుని — కార్యక్రమం ముగియడంతో ఫేడర్ ఓపెన్ చేసి, ఆకాశవాణి ఇంతవరకు మీరు.... విన్నారు అని క్లోజింగ్ ఎనౌన్సుమెంటు యిచ్చింది.

## బ్రదర్

రోజూ నీ వెంటబడి ఫాలో అయ్యే రాంబాబు ఈ మధ్య కనిపించటంలేదేమిటే.

మొన్న ఓ రోజు ఫాలో అవుతుంటే ''హల్లో బ్రదర్'' ఏం చేస్తున్నారు అని పలుకరించాను అంతే—

—కె.భవానీ రామం.
వేడంగి.



